తాను మరణిస్తూ ఐదుగురి జీవితాలకు వెలుగులు

మోహన్ రెడ్డి (ఫైల్)

ఖైరతాబాద్, డిసెంబర్ 6: తాను మరణిస్తూ అవయవదానం ద్వారా ఐదుగురు జీవితాల్లో వెలుగులు నింపాడు నల్గొండ జిల్లా భూదాన్ పోచంపల్లికి చెందిన దేవర పల్లి మోహన్ రెడ్డి(42). జీవన్‌దాన్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన ప్రకారం, మోహన్ రెడ్డి గత నెల 24న రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయప డ్డాడు. అతన్ని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, ఈ నెల 4న చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురై నట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్ దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరికించారు. ఆయన శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కార్నియాలను సేకరించారు.

పత్తి పరిశోధనకు అనుమతులు

వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 6: తెలంగాణకు రెండు అఖిల భారత సమన్వయ పత్తి పరిశోధనా కేంద్రాలు (ఎఐసీఆర్‌పీ) మంజూర య్యాయని ప్రొ. జయశంకర్ తెలం గాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య తెలిపారు. పత్తికి భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆమోదం తెలిపిం దన్నారు. రాష్ట్ర విభజన అనంతరం, భారత వ్యవసాయ పరిశో ధనా మండలి పరిధిలో పత్తి పరిశోధన చేసే సమన్వయ కేంద్రా లకు తెలంగాణ రాష్ట్రం గతంలోనే అనుమతి ఇవ్వడం అభినంద నీయమన్నారు. గత నెలలో ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశో ధన మండలి డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరె క్టర్ జనరల్ డా. టీపీ శర్మలను కలిసి తెలంగాణలో పత్తి పంట ప్రాధాన్యతను వివరించడం వల్ల, అఖిల భారత పత్తి సమన్వయ పరిశోధనా పథకంలో పీజేటీఏయూకు భాగస్వామ్యం కలిపించిం దన్నారు. వరంగల్ ప్రధాన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఐసీఏఆర్ సిబ్బందిని, నిధు లను కేటాయించి పీజేటీఏయూలో పత్తి పంటలపై పరిశోధనలను పునఃప్రారంభించి రైతులకు అండగా ఉండనున్నామని తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీకి నగేశ్..

కాచిగూడ, డిసెంబర్ 6: ఈ నెల 7 నుంచి 11 వరకు హర్యానాలోని బివానీలో జరుగునున్న జాతీయ స్థాయి కబడ్డీ టోర్న మెంట్ అండర్-19 బాలుర ఛాంపియన్ షిప్ పోటీలకు హైదరాబాద్ జిల్లా జట్టు తరు పున కాచిగూడ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి నగేశ్ ఎంపికైనట్లు కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నగేశ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, డాక్టర్ బి.లక్ష్మయ్య గంగపుత్ర, వి.ప్రసాదరావు, గీతాబాయి, శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.

నేటి నుంచి ఆదిభట్ల నారాయణ దాసు జయంతి మహోత్సవం

సిటీబ్యూరో, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ): హరికథా పితా మహుడు ఆదిభట్ల నారాయణ దాసు జయంతి మహోత్సవం నేటి నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి నల్లకుంటలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ముగింపు రోజున పద్మశ్రీ అవార్డు గ్రహీత దాలిపర్తి ఉమామహేశ్వరి భాగతారిణిని హరికథా సరస్వతి బిరుదుతో సత్కరించనున్నట్టు తెలిపారు.

రామ్‌కీ, పరవస్తు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

మెహిదీపట్నం, డిసెంబర్ 6: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వ ర్యంలో సాయుధ బలగాల కానిస్టేబుళ్ల తదితర ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్లు ఉచితంగా అందించనున్నాయి. సాయుధ బలగాల నియామకంలో భాగంగా సుమారు 40 వేలకు పైగా కానిస్టేబుళ్ల భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఉద్యో గాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు ఉచితంగా శిక్ష ణను అందించడానికి రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్లు, పోటీ పరీక్షల శిక్షణలో పేరొందిన శ్రీధర్ సీ, సీఈ సెంటర్‌తో కలిసి అర్హత పరీక్షను నిర్వహించనున్నాయి. ఈ అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన 250 మంది అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పెద పరిమి (అమరావతి) గ్రామంలో ఉన్న రామ్‌కీ ఫౌండేషన్ నైపుణ్య కేంద్రంలో శిక్షణను ఇవ్వనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని కొన్ని జిల్లా కేంద్రాలలో ఈ నెల 22వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి 25వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. డిసెంబర్ 28వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించడం జరుగుతుందని, అర్హులైన వారికి వసతి, భోజనంతో పాటు స్టడీ మెటిరియల్ ఉచితంగా అందిస్తామని రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసి డెంట్ ఎమ్వీ రామిరెడ్డి తెలిపారు. అర్హత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా మరో 750 మందికి ఉచితంగా ఆన్‌లైన్ శిక్ష ణను అందిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్లలో, ఫోన్ నం. 90007 97789, 73375 85959లలో సంప్రదించాలని సూచిస్తున్నారు.

టీ-వర్క్స్‌లో 1.5 మేటర్స్ బ్రోచర్ ఆవిష్కరణ

కొండాపూర్, డిసెంబర్ 6: గ్లోబల్ వార్మింగ్ సమస్యపై అవగా హన కల్పించడంతో పాటు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను అదుపు చేయడంలో తమ వంతు బాధ్యతగా ప్రారంభించిన 'గ్లోబల్ క్లైమేట్ యాక్షన్ మూవ్‌మెంట్ 1.5 మేటర్స్' కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ అభి నందించారు. నాలెడ్జ్ సిటీలోని టీ-వర్క్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 1.5 మేటర్స్ క్యూరేటర్, 1 మిలియన్ ఫర్ 1 బిలియన్ వ్యవస్థాపకుడు మానవ్ సుబోధ్‌తో కలిసి ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపో తున్న గ్లోబల్ వార్మింగ్‌ను అదుపులోకి తీసుకువచ్చేందుకు దేశ వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు చేపట్టిన 1.5 మేటర్స్ విజ యవంతమవ్వాలన్నారు. ఇందులో పాల్గొనేందుకు 10 వేల మంది యువ నిపుణులను సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం 1.5 మేటర్స్ బ్రోచర్‌ని ఆవిష్కరించారు.

బ్రోచర్ ఆవిష్కరణలో ఐటీ సెక్రటరీ జయేశ్ రంజన్, తదితరులు

మేయర్ ఇలాకాలో.. వసూళ్ల పర్వం

- చిరు వ్యాపారులపై హఫ్తా వసూల్
- సంతలో మేయర్ మనుషుల హల్‌చల్
- వారాంతపు అంగడిలో మామూళ్ల దందా..
- శనివారం వచ్చిందంటే.. సంత వ్యాపారుల్లో అలజడి
- ఇవ్వమన్న వ్యాపారులపై దౌర్జన్యం
- చోద్యం చూస్తున్న పోలీసు అధికారులు

సిటీబ్యూరో, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ): ప్రజా ప్రతినిధులుగా చలామణి అవుతూనే, జనాల్ని పీడించుకొని తినే రాబందులు ఇంకా నేటి సమా జంలో కొనసాగుతున్నారు. కొందరి అనాగరిక పోక డల వల్ల చిన్న, చిరు వ్యాపారులు జీవనం సాగించ లేకపోతున్నారు. శనివారం వచ్చిందంటే బస్తీలో అల జడి.. సాయంత్రం కాగానే రోడ్డుకు రెండువైపులా కూరగాయల షాపులు, పండ్ల దుకాణాలతో సహా చిరు వ్యాపారుల వద్దకు వచ్చి దర్జాగా హఫ్తా వసూల్ (వారాంతపు మూమూళ్లు) చేస్తుంటారు. ఇదేంటి? అని ప్రశ్నిస్తే.. అందరి ముందు దాడులకు తెగబడు తుంటారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలి? అని ప్రశ్నిం చిన చిరు వ్యాపారులను క్షణాల్లో అక్కడి నుంచి తరి మివేస్తుంటారు. ఇదంతా ఎక్కడో పాతబస్తీలో రౌడీల దౌర్జన్యాలు అనుకుంటున్నారా..? అయితే మీరు పప్పులో కాలేసినట్లే..! నగరం నడిబొడ్డున జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తున్న బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎన్బీటీ నగర్‌లో ప్రతి శనివారం కొనసాగుతున్న మామూళ్ల వసూళ్ల పర్వంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తామంతా మేయర్ మనుషుల మని, మహిళలకు రక్షణగా నిలుస్తూ డబ్బులు వసూలు చేసుకుంటామని వారంతా బాహాటంగానే చెప్పుకుంటారంటే.. పరిస్థితి ఏవిధంగా ఉందో... అర్థం చేసుకోవచ్చు. ఈ వసూళ్ల దందా ఇటీవల పోలీస్ స్టేషన్ దాకా చేరడం గమనార్హం.

ఎన్బీటీ నగర్ బస్తీలో కొన్నేండ్లుగా సంత..

బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ముందు ఖాళీ స్థలంలో కొన్నేండ్లుగా వారాంతపు సంత నిర్వహిస్తుం టారు. వివిధ ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు వచ్చి కూరగాయాలు, పండ్లు, ఆకు కూరలు, ఇతర వస్తువులు విక్రయిస్తుంటారు. సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల దాకా నడుస్తున్న ఈ సంతలో చిరు వ్యాపారుల వద్ద నుంచి మేయర్ మనుషులుగా చెలా మణి అయ్యే కొంత మంది మహిళలు ముఠాగా ఏర్పడి డబ్బులు వసూలు చేసుకుంటారు. ఒక్కో దుకాణానికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి శనివారం అక్క డకు వచ్చి డబ్బులు వసూలు చేసుకుంటారు. ఒక్కో చిరు వ్యాపారి నుంచి రూ.60 నుంచి రూ.80 చొప్పున డబ్బులను దర్జాగా వసూలు చేసుకుంటున్న మహిళల దౌర్జన్యంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తు న్నాయి. అయితే, ఇదంతా నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కనుసన్నల్లోనే జరుగుతోందని, ఆమె అనుచరులుగా చెలామణి అవుతున్న మహిళలు ప్రతి శనివారం సుమారు రూ.15 వేల నుంచి 18 వేల దాకా హఫ్తా వసూల్ చేస్తున్నారని స్థానికులు ఆరోపి స్తున్నారు, ఇదేంటని ప్రశ్నిస్తే మహిళలు కూరగా యాల మార్కెట్‌కు వస్తే గతంలో రక్షణ ఉండేది కాదని, ఆకతాయిలు వారిని వేధిస్తుండేవారని, తాము మహిళా సంఘాల తరపున రక్షణ కోసం వచ్చి నిలుస్తుండటంతో మహిళలకు వేధింపులు తగ్గిపో యాయంటూ దబాయిస్తున్నారు. కాగా, ఈ మొత్తం వ్యవహారంలో 10 నుంచి 12 మంది మహిళలు జట్టుగా ఏర్పడి ప్రతి శనివారం వచ్చే డబ్బులను పంచుకుంటారని, ఎవరైనా ఎదిరిస్తే దాడులు కూడా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై గతంలోనే బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదులు వెళ్లినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవ డంతో పాటు ఏకంగా మేయర్ అండదండలు ఉండ టంతో వీరంతా 'శనివారం మాది' అనుకుంటూ వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మేయర్ చూసీ చూడనట్లు వ్యవహ రించడం, తమ బతుకులను ఛిద్రం చేస్తున్న వసూళ్ల పర్వాన్ని ఆపేయాలని, తమకూ ఖర్చులు, వ్యవహా రాలు, పిల్లలు, కుటుంబాలు ఉన్నాయనే విషయాన్ని మర్చిపోవద్దని చిరు వ్యాపారులు వేడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న పోలీసులైనా రంగప్రవేశం చేసి మామూళ్ల వసూళ్లకు అడ్డుకట్ట వేస్తా రని వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కందగట్ల స్వామి

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణ పాఠం తప్పదు

- పద్మశాలీల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- నామినేటెడ్ పదవుల్లో పద్మశాలీలకు అవకాశమేది?
- అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 6: రాష్ట్రం లోని పద్మశాలీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించినదని, ఇందుకు తగినట్టుగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెబుతామని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి హెచ్చ రించారు. నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పద్మశాలీ దర్శిని ప్రధాన కార్యదర్శి నక్కా వేణు మాధవ్, సంఘం నేత గంగాధర్ తిలక్‌తో కలిసి కంద గట్ల స్వామి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైనప్పటికీ పద్మశాలీల సంక్షేమం, అభ్యున్నతి కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శిం చారు. ఇందిరమ్మ రాజ్యమంటే బీసీలను అణ గదొక్కడమేనా? అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రెడ్డి రాజ్యంలో పద్మశాలీల జీవి తాలు ఏమాత్రం మెరుగు పడలేదని, 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారిందన్నారు. పద్మశాలీ కార్పొరేషన్‌ను అటకెక్కించడంతో పాటు టెస్కో, పవర్‌లూమ్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం తుంగలో తొక్కిం దని ఆరోపించారు. నామినేటెడ్ పదవులను దొడ్డి దారిలో అగ్రకులాల వారికే కేటాయిస్తూ పద్మశాలీ కులస్తులను విస్మరిస్తున్నారన్నారు. పద్మశాలీల్లో అర్హులైన విద్యావంతులు ఉన్నా రని, వారికి యూనివర్సిటీలలో వీసీలుగా అవ కాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆర్సీపురంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్

- తళుక్కుమన్న అందాల తార శ్రీలీల
- అభిమానుల్లో జోష్

షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీనటి కుమారి శ్రీలీల, సంస్థ యజమానులు ఎస్.రాజమౌళి, పి.వెంకటేశ్వర్లు

రామచంద్రాపురం, డిసెంబర్ 6: సినీతార శ్రీలీల ఆర్సీపురం సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో సందడి చేసింది. ఆర్సీపురంలోని జాతీయ రహదారిని ఆనుకొని నూతనంగా ఏర్పాటు చేసిన 37వ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీ హీరోయిన్ శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరైంది. ముందుగా ఆమెకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యజమానులు వెంకటేశ్వర్లు, రాజమౌళి స్వాగతం పలికారు. అనంతరం, ఎండీ వెంకటేశ్వర్లుతో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి హీరోయిన్ శ్రీలీల షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం షాపింగ్ మాల్‌లో కలియతిరుగుతూ ఫస్ట్, సెకండ్ తదితర ఫ్లోర్‌లకు వెళ్లి సందర్శిం చారు. ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లోని సారీ కౌంటర్ వద్దకు వచ్చారు. సౌత్ ఇండియాకు సంబంధించిన చీరలను మీడియా ముందు ఆవిష్కరించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, స్థానికులకు సంస్థ డైరెక్టర్లు అయిన సురేశ్ సీర్ల, అభినయ్, రాకేశ్, కేశవ్‌లు స్వాగతం పలికారు. డైరెక్టర్ సురేశ్ మాట్లాడుతూ, బీహెచ్ఈఎల్, రామచం ద్రాపురం వాసులు కోరుకునే నాణ్యతకు, నవ్యత్వానికి పెద్ద పీట వేశామన్నారు. డైరెక్టర్ అభినయ్ మాట్లాడుతూ, పర్వదినాలకు, భారతీయ సంప్రదాయ కలెక్షన్లకు తమ షోరూమ్ విశేషమైన కేంద్రంగా నిలుస్తుందన్నారు. మరో డైరెక్టర్ రాకేశ్ మాట్లాడుతూ, తమ షోరూమ్ అన్ని రకాల వస్త్రాలకు ధరల్లోనూ, నాణ్యతలోనూ వస్త్ర ప్రియుల అభి రుచులను ప్రతిబింబిస్తున్నదన్నారు. ఇంకా డైరెక్టర్ కేశవ్ మాట్లాడుతూ, వైవిధ్యభరిత మైన వస్త్రాలను కోరుకునే కొనుగోలుదారులు అతి పెద్ద సంఖ్యలో ప్రతి వెరైటీని అందిం చేందుకు తాము ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 37వ బ్రాంచ్‌ని ప్రారంభించి నందుకు చాలా సంతోషంగా ఉన్నదని, ముమ్మందు సౌత్ ఇండియా మాల్స్ ప్యాన్ ఇండియాకి ఎదగాలని ఆకాంక్షించారు. సౌత్ ఇండియాలో సరసమైన ధరలకే వినియో గదారులు షాపింగ్ చేయవచ్చని, పండుగలు, శుభకార్యాలకు సౌత్ ఇండియాలోనే షాపింగ్ చేయాలన్నారు. అక్కడి నుంచి మాల్ బయట ఏర్పాటు చేసిన స్టేజి వద్దకు వచ్చి అభిమానులతో మాట్లాడి వారిలో జోష్ నింపారు. అభిమానులను ఉత్సాహప ర్చుతూ మాట్లాడారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ని ఆదరించాలన్నారు. అందాల తారను వారి ఫోన్‌లల్లో బంధించేందుకు అభిమానులు ఫొటోలు, వీడియోలు తీసుకు న్నారు. అవకాశం దొరికిన వారు ఆమెతో సెల్ఫీలు దిగారు. ఇదిలా వుంటే ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ నేతృత్వంలో పోలీసులు చర్యలు తీసు కున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పా నగేశ్, ఎస్సై రామకృష్ణ, షాపింగ్ మాల్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



నార్కోటిక్స్ బ్యూరో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజే రావు

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఐక్యంగా పోరాడాలి

కొండాపూర్, డిసెంబర్ 6: విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల బెడదపై ఐక్యంగా పోరాడాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివ ర్సిటీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నార్కోటిక్స్ బ్యూరో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ మాట్లాడుతూ, విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల బెడద నిర్మూలనకు ఐక్యంగా పోరాడాల న్నారు. మాదక ద్రవ్యాల వాడకం పెరిగిపోతుందని, ఇది సామాజిక దురాగతా లకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించడానికి, నిర్మూలించడగానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేశ్ నిగమ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య పాల్గొన్నారు.

సక్సెస్ అన్ లిమిటెడ్ పై సదస్సు నేడు

చిన్మయ మిషన్ 75 వసంతాలు పూరి చేసుకుంటున్న సందర్భాన్ని పురస్క రించుకుని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భారతీయ విద్యా భవన్‌లో 'సక్సెస్ అన్ లిమిటెడ్' పై శనివారం సదస్సు జరుగనుంది. ఇందుకు సంబంధించిన గోడ పత్రి కను బేగంపేట్‌లోని చిన్మయ మిషన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మిషన్ అధ్య క్షులు రామచంద్రమూర్తి, రవీంద్రనాథ్, శివరామ్ ప్రసాద్‌లతో కలిసి ఆవిష్కరిం చారు. విజయం కొంత మందినే వరిస్తోంది.. చాలా మందికి అది దూరం కావ డానికి గల కారణాలపై చిన్మయ మిషన్ గ్లోబల్ హెడ్ స్వామి స్వరూపానంద, శని వారం సాయంత్రం 6.30 గంటలకు నుంచి జరిగే ఈ సదస్సులో ప్రత్యేకంగా ప్రసంగిస్తారని మిషన్ అధ్యక్షులు రామచంద్రమూర్తి తెలిపారు.

– అమీర్‌పేట, డిసెంబర్ 6

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రభుత్వ స్కూళ్ల జాడేది?

- స్థలాభావం, నిధుల కొరతతో ప్రయివేట్ స్కూళ్లో ఏర్పాటు
- వెలవెలబోయిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన
- జిల్లా స్థాయి పోటీల్లో కనిపించని ప్రభుత్వ విద్యార్థుల జాడ
- 147 వైజ్ఞానిక ప్రదర్శనల్లో 12 మాత్రమే సర్కారీ విద్యార్థులవి

సిటీబ్యూరో, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ): విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి వేదికగా నిలిచే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రభుత్వ విద్యార్థుల పాత్ర తగ్గిపోవడంతో సంబంధిత అధికా రులపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. హైదరా బాద్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శుక్ర వారం ముషీరాబాద్‌లోని సెయింట్ పాయస్ హై స్కూల్‌లో ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. కాగా, ఈ ప్రద ర్శనలో 147 ఎగ్జిబిట్లలో కేవలం 12 మాత్రమే ప్రభుత్వ విద్యార్థులవి. మిగిలిన ఎగ్జిబిట్లన్నీ ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులవి. అయితే, విద్యా ర్థుల్లో వినూత్న ఆలోచనా శక్తిని వెలికి తీసేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఉపయోగపడుతుంది. ఇందుకు నాలుగు నెలల నుంచి ప్రభుత్వ పాఠశాల టీచర్లు తమ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కానీ, పోటీల్లో మాత్రం ప్రభుత్వ విద్యార్థులు అత్యల్ప సంఖ్యలో ఉన్నారు. సాధారణంగా విద్యా శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పాఠశాలల హెచ్ ఎంలు, టీచర్లతో సమావేశమై విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాల్సి ఉంటుంది. విద్యార్థుల ఆలోచనలను కార్య రూపంలోకి తీసుకురావడానికి అవసరమయ్యే పరిక రాలు, సాంకేతిక ఎక్విప్‌మెంట్, ప్రాజెక్టు పరికరాలు ఇలా అన్నీ సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వ పాఠ శాలలదే. అందుకోసం ప్రత్యేక నిధులను సైతం కేటా యించాల్సి ఉంటుంది. విద్యార్థి ఏదైనా ఆలోచన చెప్పినప్పుడు దానిని కార్యరూపంలోకి తీసుకొచ్చేలా అండగా నిలవాల్సి ఉంటుంది. కానీ, హైదరాబాద్‌లో కలెక్టర్ అనుదీప్ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రభుత్వ విద్యార్థుల పాత్రపై పెద్దగా దృష్టి సారించినట్టు కనిపిం చలేదని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ప్రయివేట్ స్కూల్స్ విద్యార్థులు నూతన సాంకేతిక తను ఒడిసిపట్టుకుని ఎగ్జిబిట్లు రూపొందించడం విశేషం. ఇలాంటి ఎగ్జిబిట్లను మరింత బ్రహ్మాండంగా రూపొందించే ఆలోచనా శక్తి ఉన్నప్పటికీ ప్రభుత్వ విద్యార్థులు డబ్బులేక చిన్న చిన్న ఎగ్జిబిట్లతో ముగిం చేశారు. సాధారణంగా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు వేదికగా ప్రభుత్వ స్కూల్ నిలవాలి. కానీ, హైదరా బాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రదర్శనకు సరిపడా స్థలం లేదని ఓ ప్రయివేట్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు.

విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్. చిత్రంలో తదితరులు

29న గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం ఎన్నికలు

అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు..

అంబర్‌పేట, డిసెంబర్ 6: తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం ఎన్నికలు ఈ నెల 29వ తేదీ, ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎన్నికల ప్రధానా ధికారి ఎన్.నారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్ర బాధ్యు లైన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు జరుగనున్నాయని చెప్పారు. అర్హులైన అభ్య ర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీలోపు వారి నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారికి సమర్పించా లని పేర్కొన్నారు. మొదటిసారిగా ఈ ఎన్నికలు పార దర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని అన్నారు. మొత్తం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 4,207 మంది సాధారణ సభ్యుల సెల్‌ఫోన్‌కు 'వా ట్సాప్' ద్వారా బ్యాలెట్ పేపర్ లింక్ పంపడం జరు గుతుందని వెల్లడించారు. సభ్యులంతా వారి ఇంటి నుంచే సెల్‌ఫోన్ ద్వారా బ్యాలెట్ లింక్ పైన క్లిక్ చేసి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

డిప్యూటీ సీఎం పర్యటనలో ప్రొఫెసర్‌కు అవమానం

- యూనివర్సిటీ రిజిస్ట్రార్ అవమాన పరిచాడని ప్రొఫెసర్ ఆవేదన
- డిప్యూటీ సీఎం బట్టికి ఫిర్యాదు చేసిన ప్రొఫెసర్ వసుమతి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 6: యంగ్ డైవర్ కావాలా? అని జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ అసభ్య పదజాలంతో తనను వేధించిన రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమా ర్కకు, వర్సిటీ డీయూఎఫ్ఆర్ డైరెక్టర్, ప్రొఫెసర్ వసుమతి ఫిర్యాదు చేశారు. బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క శుక్రవారం హాజరు కాగా, వర్సిటీ ప్రొఫె సర్ వసుమతి బోరున విలపిస్తూ.., తనకు జరిగిన అన్యాయాలను డిప్యూటీ సీఎంకు వివరించారు. రిజి స్ట్రార్ కావాలనే పోలీసుల సహకారంతో తనను అడ్డు కున్నారని, తన వాహనాన్ని చెక్ చేసి అవమానపరి చారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో డైరెక్టర్‌గా, మహిళా ఎస్టీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న తనను కావా లనే రిజిస్ట్రార్ ఇబ్బంది పెడుతున్నారన్నారు. గతంలో నీకు యంగ్ డైవర్ కావాలా? అని అసభ్య పదజా లంతో అందరి ఎదుట అవమానించాడన్నారు. మహిళా, ఎస్టీ ప్రొఫెసర్‌ను అవమానించిన రిజిస్ట్రా ర్‌ను వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్